చీకటిలో చిరుదీపంలా..



బర్మా కాలనీకి చెందిన చిత్తారపు రోజా భర్త రామారావుతో కలిసి చెన్నై వెళ్లారు. తిరుగు ప్రయాణంలో రామారావు రైల్లోనే గుండెపోటుతో మృతి చెందారు. పెయింటింగ్ పనులు చేసుకునే చిరుద్యోగి కావడంతో ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రమే. భర్తను ఇంటికి తీసుకువచ్చి, దహన సంస్కారాలు చేయడానికి కూడా ఇబ్బంది పడే పరిస్థితి. ఆ ఆలోచనల్లోనే ఆమె ఇంటికి వచ్చేసరికి డ్వాక్రా గ్రూపు సభ్యులు ఉన్నారు. రూ.25వేలు చేతిలో పెట్టారు. ఒక్కసారిగా ప్రాణం లేచి వచ్చింది. అనంతరం జరగాల్సినవన్నీ శాస్త్రోక్తంగా జరిపించారు.



బర్మా కాలనీకి చెందిన చింతపల్లి వెంకటలక్ష్మి భర్త అప్పారావు కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించేవాడు. వీరికి ఒక కుమారుడు ఉన్నాడు. అప్పారావు అనారోగ్యంతో మృతి చెందడంతో ఆ కుటుంబం రోడ్డున పడిపోయింది. బర్మా కాలనీ–1 ఎస్ఎల్ఎఫ్‌లో డ్వాక్రా గ్రూపులో ఉన్న ఆమెకు గ్రూపు సభ్యులు అండగా నిలిచారు. రూ.23వేలు అందించి ఆదుకున్నారు.



అదే ప్రాంతానికి చెందిన ఎం.కల్యాణి భర్త సతీష్‌కుమార్ రైల్వేలో కాంట్రాక్ట్ కార్మికునిగా పని చేసేవాడు. వీరికి ఒక కుమారుడు ఉన్నాడు. సతీష్‌కుమార్ అనారోగ్యంతో మృతి చెందారు. ఆమె కష్టం తెలిసి డ్వాక్రా మహిళలు రూ.24వేలు అందించారు.

చీకటిలో వెలిగించే చిరుదీపమే ఎంతో కాంతినిచ్చి, అంధకారాన్ని దూరం చేస్తుంది. అలాగే ఆపద వేళ అందించే చిరుసాయమే ఆ కష్టం నుంచి బయటపడేలా చేసి, భవిష్యత్తుకు భరోసాను కల్పిస్తుంది. అలా ఎన్నో కుటుంబాలకు అండగా నిలుస్తున్నారు బర్మా కాలనీలోని డ్వాక్రా మహిళలు. ఇంటి పెద్దను కోల్పోయి, తీరని దుఃఖంలో ఉన్న అతివలకు చేయూతనిస్తున్నారు. ధైర్యాన్నిచ్చి ముందుకు నడిపిస్తున్నారు. ఎంతోమందికి ఆదర్శంగా నిలుస్తున్నారు.

- ఆపద వేళ అండగా నిలుస్తున్న డ్వాక్రా మహిళలు
- సహచర సభ్యులకు కష్టంలో చేయూత



బర్మాకాలనీ -1 ఎస్ఎల్ఎఫ్‌లో డ్వాక్రా గ్రూపు సభ్యులు

పెదగంట్యాడ: అయిన వారిని కోల్పోతే ఆ బాధ వర్ణనాతీతం. అందునా ఇంటికి పెద్ద దిక్కును కోల్పోతే పరిస్థితి అగమ్యగోచరం. అలాంటి పరి స్థితుల్లో ఉన్న మహిళలకు సాయం అందిస్తూ.. మేమున్నామంటూ ఆదుకుంటున్నారు డ్వాక్రా మహిళలు.

ఆర్పీ నీలాపు వరలక్ష్మి ఆధ్వర్యంలో 25 డ్వాక్రా గ్రూపులు ఉన్నాయి. అందులో 250 మంది సభ్యులు ఉన్నారు. ఆయా గ్రూపుల్లోని మహిళలకు ఏ కష్టం వచ్చినా ఆదుకుంటున్నారు. ఒక్కొక్కరు రూ.100 వేసుకుని, వచ్చిన మొత్తాన్ని తమ సహ సభ్యురాలికి అందజేస్తున్నారు. పుట్టెడు దుఃఖంలో ఉన్న ఆమెకు ఓదార్పునిస్తున్నారు. తోడును కోల్పోయి, నిస్తేజంగా ఉన్న ఆ ఇల్లాలికి ధైర్యాన్ని చ్చి, భవిష్యత్తులో ఆమె ముందుకు వెళ్లడానికి భరోసా కల్పిస్తున్నారు. పిల్లలకు మంచి భవిష్యత్తు ను అందించేందుకు సహాయపడుతూ మానవతను చాటుతున్నారు. స్ఫూర్తిదాతలుగా నిలుస్తున్నారు.

దేవతలా ఆదుకున్నారు



నా భర్త బాబూరావు అనారోగ్యంతో మృతి చెందాడు. అప్పుడు దహన సంస్కారాలకు కూడా డబ్బులు లేవు. ఏం చేయాలో దిక్కుతోచని స్థితిలో ఉన్నాను. అప్పుడు ఆర్పీ వరలక్ష్మి దేవతలా వచ్చింది. రూ.23 వేలు ఇచ్చింది. సభ్యులందరినీ ఒకచోట చేర్చి కష్టంలో ఆదుకుంది. వారి రుణం తీర్చుకోలేనిది.

– మద్దిల అప్పనర్సమ్మ, బర్మా కాలనీ

చలించిపోయాను



నేను ఒక గ్రూపు సభ్యురాలి భర్త మృతి చెందినపుడు పరామర్శకు వెళ్లాను. ఆమె భర్త అంతిమ సంస్కారాల కోసం అక్కడకు వచ్చిన వారు డబ్బులు ఎత్తుకోవడం చూసి ఎంతో బాధ అనిపించింది. ఈ పరిస్థితి మా గ్రూపు సభ్యులకు రాకూడదని నిర్ణయం తీసుకున్నాను. మా సభ్యులందరితో మాట్లాడాను. వారంతా నాతోపాటు నిలిచారు. ఎవరు చనిపోయినా ఒక్కొక్కరం రూ.100 చొప్పున సేకరించి అందిస్తున్నాం.

– నీలాపు వరలక్ష్మి, ఆర్పీ

రేపు జాబ్‌మేళా



జాబ్‌మేళా పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి తదితరులు

పెదగంట్యాడ: స్టీల్‌సిటీ న్యూ ఐటీఐలో ఈ నెల 7న జాబ్ మేళా నిర్వహించనున్నామని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి తెలిపారు. జాబ్‌మేళా పోస్టర్‌ను స్థానిక టీఎన్ఆర్ ఫంక్షన్ హాల్లో బుధవారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనే లక్ష్యమన్నారు. పదో తరగతి, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, బీటెక్ చదువుకున్న విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రీజనల్ స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి రోహిణి వివరాలను వెల్లడించారు. శుక్రవారం ఉదయం 9 గంటలకు 11 ప్రముఖ కంపెనీల్లో సుమారు 500 పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు ప్రారంభమవుతాయని తెలిపారు. 18 సంవత్సరాల నుంచి 35 సంవత్సరాల వయసు వారు అర్హులన్నారు. అభ్యర్థులు ఫార్మల్ డ్రెస్ వేసుకోవాలని సూచించారు. అడ్మిట్ కార్డు, ఒరిజినల్ సర్టిఫికెట్లు, పాస్‌పోర్టు సైజు ఫొటో తీసుకురావాలని తెలియజేశారు. ఆసక్తి గల విద్యార్థులు ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 9014772885, 9848438254 నంబర్లకు కాల్ చేసి వివరాలు తెలుసుకోవచ్చని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్ రెడ్డి, పార్టీ 76వ వార్డు ఇన్‌చార్జి దొడ్డి రమణ, డి.ఎస్. సాయికృష్ణ, చైతన్య, రమేష్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మేనేజ్‌మెంట్ విద్యార్థులకు అపార అవకాశాలు



పాండిచ్చేరి యూనివర్సిటీ ప్రొఫెసర్ వెంకటరావును సత్కరిస్తున్న యాజమాన్య ప్రతినిధులు

అగనంపూడి: మేనేజ్‌మెంట్ కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులకు ప్రపంచంలోని నలుమూలలా మంచి డిమాండ్ ఉందని పాండిచ్చేరి యూనివర్సిటీ ప్రొఫెసర్ వై.వెంకటరావు అన్నారు. దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాల ఆవరణలో ఎంబీఏ విద్యార్థులకు మేనేజ్‌మెంట్ స్కిల్స్‌పై నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. నిర్వహణ, నాయకత్వ లక్షణాలు ఉన్నవారికి బహుళజాతి సంస్థల్లో మంచి ప్యాకేజీతో ఉద్యోగావకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. మార్కెటింగ్, కమ్యూనికేషన్ స్కిల్స్‌పై విద్యార్థులు దృష్టి పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల రెక్టార్ వి.మధుసూదనరావు, సీఈవో శ్రీకాంత్, ప్రిన్సిపాల్ జె.సుధాకర్, వైస్ ప్రిన్సిపాల్ రవీంద్ర, విభాగాధిపతి మురళీకృష్ణ, కో–ఆర్డినేటర్ మదన్ తదితరులు పాల్గొన్నారు.

కుట్టుశిక్షణతో గార్మెంట్ యూనిట్లలో అవకాశాలు

- అపెరల్ పార్క్ అడ్మినిస్ట్రేటర్ పద్మ
- హ్యాండ్‌లూమ్స్ అండ్ టెక్స్‌టైల్స్ డైరెక్టర్ చేతుల మీదుగా సర్టిఫికెట్ల పంపిణీ



శిక్షణ పూర్తి చేసుకున్న మహిళకు సర్టిఫికెట్ అందజేస్తున్న నాయక్

అక్కిరెడ్డిపాలెం: కుట్టు శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు అపెరల్ పార్క్‌లో స్థాపించిన వివిధ గార్మెంట్స్ యూనిట్లలో ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు పార్క్ అడ్మినిస్ట్రేటర్, అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ వి.పద్మ తెలిపారు. నెలరోజుల పాటు కుట్టు పనిలో శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు హ్యాండ్‌లూమ్స్ అండ్ టెక్స్‌టైల్స్ కమిషనర్ ఎం.ఎం.నాయక్ చేతుల మీదుగా సర్టిఫికెట్లను అందజేశారు. ఆటోనగర్‌లోని అపెరల్ పార్క్‌లో గల శిక్షణ కేంద్రంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో శిక్షణ తీసుకున్న మహిళలతో నాయక్ మాట్లాడారు. పలు అంశాలను వివరించారు. కార్యక్రమంలో హ్యాండ్‌లూమ్స్ అండ్ టెక్స్‌టైల్స్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ సునీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న పోర్టు కార్మికుల నిరవధిక దీక్షలు



దీక్ష శిబిరం వద్ద మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్

పెదగంట్యాడ: అదానీ గంగవరం పోర్టులో పని చేస్తున్న కార్మికులకు జీతాలు పెంచాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కె.ఎం. శ్రీనివాస్ డిమాండ్ చేశారు. గంగవరం పోర్టు ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో చేపట్టిన నిరవధిక దీక్షలు బుధవారం రెండో రోజూ కొనసాగాయి. ఈ శిబిరాన్ని సందర్శించిన శ్రీనివాస్ మాట్లాడుతూ విధుల నుంచి తొలగించిన వారిని మళ్లీ విధుల్లోకి తీసుకునే వరకూ పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. 64వ వార్డు కార్పొరేటర్ దల్లి గోవింద్ మాట్లాడుతూ పోర్టు యాజమాన్యం స్పందించి నిర్వాసిత కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ప్రగతిశీల కార్మిక సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి కొండారెడ్డి, అన్నపూర్ణ, భారత్ బచావ్ జిల్లా కార్యదర్శి డాక్టర్ పొన్నాడ శ్రీనివాస్, గంగవరం పోర్టు ఎంప్లాయీస్ యూనియన్ ఉపాధ్యక్షుడు కొవిరి అప్పలరాజు, ప్రధాన కార్యదర్శి నొల్లి తాతారావు, కోశాధికారి వాసుపల్లి ఎల్లాజీ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ సంఘీభావం

గంగవరం పోర్టు కార్మికులు చేపట్టిన నిరవధిక దీక్షలకు కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీ నాయకులు మద్దతు తెలిపారు. నాయకులు దీక్ష శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలియజేశారు. కార్యక్రమంలో జెర్రిపోతుల ముత్యాలు, పులి వెంకటరమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటీకరణతో దేశ ఆర్థికవ్యవస్థ పతనం



874వ రోజు దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: దేశ ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వరంగ సంస్థలే ఆధారమని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. అటువంటి సంస్థలను ప్రైవేటీకరణ చేయడం వల్ల దేశ ఆర్థిక వ్యవస్థ పతనమవుతుందని పేర్కొన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షల్లో 874వ రోజు బుధవారం సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కార్మికవర్గాన్ని, నిర్వాసితులను, నిరుద్యోగులను నడిరోడ్డుపై పడేసే విధంగా కేంద్ర ప్రభుత్వం కుట్రలు చేస్తోందన్నారు. ఆ దుశ్చర్యలను ఉద్యమాల ద్వారా అడ్డుకుంటామన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

యాత్రికులకు వసతి కోసం వినతి

అగనంపూడి: వివిధ రాష్ట్రాల నుంచి వచ్చే షిర్డీ సాయి భక్తుల కోసం వసతి ఏర్పాటుకు అవసరమైన నిధులు కేటాయించాలని అగనంపూడి షిర్డీ సాయి సేవా సమితి ప్రతినిధులు ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డిని కోరారు. ఆయన్ను కలిసి వినతిపత్రం అందించారు. ఆలయం హైవేను ఆనుకొని ఉండడం వల్ల వివిధ రాష్ట్రాల నుంచి వచ్చే యాత్రికులు ఆలయ ఆవరణలోనే స్నానాలు, అన్నపానీయాలు ఏర్పాటు చేసుకుంటున్నారని తెలిపారు. ఆవరణలో వసతి భవనం నిర్మిస్తే యాత్రికులకు సౌకర్యంగా ఉంటుందని కోరారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో ప్రతినిధులు కె.రమణారెడ్డి, డి.వ్యాసశర్మ పి.సత్యనారాయణ ఉన్నారు.

దువ్వాడ స్టేషన్ రోడ్డులో విద్యుదీకరణకు విన్నపం

అగనంపూడి: అగనంపూడి జాతీయ రహదారి కూడలి నుంచి దువ్వాడ రైల్వేస్టేషన్ వరకు విద్యుదీకరణ చేపట్టాలని అగనంపూడికి చెందిన నాయకులు 86వ వార్డు కార్పొరేటర్ లేళ్ల కోటేశ్వరరావును వినతిపత్రంలో కోరారు. రాజీవ్‌నగర్, దువ్వాడ పరిసర ప్రాంతాలకు చెందిన ఉక్కు ఉద్యోగులతో పాటు వీఎస్ఈజెడ్ షిఫ్ట్ ఉద్యోగులు, ప్రయాణికులు ఆ మార్గంలో రాకపోకలు సాగిస్తున్నారని తెలిపారు. రాత్రివేళల్లో వీధి దీపాలు లేక ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. గతంలో సెంట్రల్ లైటింగ్ ప్రతిపాదనలు చేశారని, జీవీఎంసీ నిధులతో విద్యుదీకరణ చేపట్టేలా చొరవ తీసుకోవాలని నాయకులు నెల్లి శ్రీనివాసరావు, బలిరెడ్డి సత్యనారాయణ, ఎం.వెంకటరమణ, ఎం.శ్రీను, వి.నారాయణరావు కోరారు.

ప్రతి పౌరుడి ముఖంలో చిరునవ్వే లక్ష్యం

జగనన్న సురక్ష శిబిరంలో ఎమ్మెల్యే నాగిరెడ్డి



దరఖాస్తుదారునికి ధ్రువపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

గాజువాక: తమ సమస్యల పరిష్కారం కోసం అధికారుల వద్దకు వచ్చే ప్రతి పౌరుడి ముఖంలో చిరునవ్వు చూడాలన్నదే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. ఆ ఉద్దేశంతో ప్రవేశపెట్టిన కార్యక్రమమే జగనన్న సురక్ష అని పేర్కొన్నారు. 73వ వార్డు గొంతినవానిపాలెం, సీతానగరంలలో, 72వ వార్డు జీవీఎంసీ గాజువాక జోనల్ కార్యాలయంలో జగనన్న సురక్ష శిబిరాలను బుధవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దరఖాస్తుదారులకు గంటలు, నిమిషాల వ్యవధిలో న్యాయం అందించడమే జగనన్న సురక్ష లక్ష్యమన్నారు. సురక్ష కార్యక్రమం ద్వారా 11 రకాల ప్రభుత్వ సేవలను పూర్తిగా ఉచితంగా పొందవచ్చని, దరఖాస్తుదారులు అడిగిన ధ్రువపత్రాలను అవసరమైతే వలంటీర్లే నేరుగా ఇంటింటికీ వెళ్లి అందజేస్తారని తెలిపారు. ప్రతీ ఒక్కరికి న్యాయం చేయాలన్న లక్ష్యంతోనే ముఖ్యమంత్రి ఈ కార్యక్రమాన్ని తీసుకొచ్చారని తెలియజేశారు.

చంద్రబాబువి కల్లబొల్లి కబుర్లే..

గతంలో చంద్రబాబు హయాంలో ఏ ఒక్కరికీ న్యాయం జరగలేదని, మళ్లీ ఇప్పుడు కల్లబొల్లి మాటలతో జనంలోకి వస్తున్నారని ఎమ్మెల్యే అన్నారు. ఆయన్ను ఎవ్వరూ నమ్మబోరని అన్నారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలన్నీ అమలు చేశారన్నారు. ఈ సుపరిపాలనను కొనసాగించడం కోసం జగన్ మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా ప్రజలు దీవించాలని కోరారు. అనంతరం పలువురికి సురక్ష పథకం ద్వారా మంజూరైన ధ్రువపత్రాలను అందజేశారు. కార్యక్రమాల్లో జీవీఎంసీ అదనపు కమిషనర్ వర్మ, గాజువాక జోనల్ కమిషనర్ పి.సింహాచలం, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్య దర్శి తిప్పల దేవన్‌రెడ్డి, కార్పొరేటర్ భూపతిరాజు సుజాత, వార్డు ఇన్‌చార్జిలు రాజాన వెంకటరావు, స్థానిక నాయకులు కంది పైడినాయుడు, పాల అప్పలరెడ్డి, కుప్పిలి వరలక్ష్మి, పిన్నింటి ఆదిలక్ష్మి, శంకర్ నాయుడు, అలీ, ఈశ్వరరావు, జగదీష్, సచివాలయ కన్వీనర్లు, వార్డు వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.


చేనేత, హస్తకళా ప్రదర్శన ప్రారంభం



హస్తకళా ప్రదర్శన ప్రారంభిస్తున్న అంబేడ్కర్ కళాక్షేత్రం కార్యదర్శి నర్సింగరావు

ఉక్కునగరం: చేనేత, హస్త కళలను ప్రోత్సహించాల్సిన బాధ్యత అందరిపై ఉందని స్టీల్‌ప్లాంట్ అంబేడ్కర్ కళాక్షేత్రం కమిటీ కార్యదర్శి నర్సింగరావు అన్నారు. భావనా రుషి చేనేత హస్త కళా కార్మిక సేవా సంఘం ఆధ్వర్యంలో అంబేడ్కర్ కళాక్షేత్రంలో ఏర్పాటు చేసిన చేనేత, హస్తకళా ప్రదర్శనను బుధవారం ఆయన ప్రారంభించారు. సేవా సంఘం నిర్వాహకులు ఎ. సింహాద్రి, బి. సురేష్ మాట్లాడుతూ పోచంపల్లి, నారాయణపేట, ఉప్పాడ, చీరాల, మంగళగిరి, కలంకారి, ఫ్యాన్సీ, ఖాదీ, కాటన్ ప్రింటెడ్, బెంగాల్ సిల్క్, కాంతావర్క్ కాటన్, భాగల్‌పూర్ సిల్క్, బాంధిని సిల్క్, గుజరాత్ డిజైన్ టాప్స్, లక్నో చికెన్ వర్క్స్, డోర్ కర్టెన్లు, డోర్ మ్యాట్లు, వరంగల్ టవల్స్ అండ్ బెడ్‌షీట్లు, రాజస్థానీ ప్రింటెడ్ టాప్స్, జైపూర్ టాప్స్, బెడ్‌షీట్లు, ఖాదీ షర్ట్స్, సారంగాపూర్ వుడ్ ఐటమ్స్ ప్రదర్శనలో ఉంచామన్నారు. ఈ నెల 23 వరకు ప్రదర్శన ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో కళాక్షేత్రం ప్రతినిధులు త్రినాథ్, వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

డీఎంహెచ్‌వో ఆకస్మిక తనిఖీ



సిబ్బందికి సూచనలు ఇస్తున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

పెదగంట్యాడ: జీవీఎంసీ 65వ వార్డు గిరిజా కాలనీలోని పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి, సిబ్బంది హాజరుపై ఆరా తీశారు. రోగులకు సేవలు ఎలా అందిస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. సమయపాలన పాటించాలని సూచించారు. అనంతరం జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. మందులను అందుబాటులో ఉంచుకోవాలన్నారు.

పేదల సంక్షేమమే ధ్యేయం



గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

పెదగంట్యాడ: పేదల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి పాలన అందిస్తున్నారని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా 74వ వార్డు వియ్యపువానిపాలెంలో బుధవారం సాయంత్రం ఆయన పర్యటించారు. కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డితో కలిసి ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులను కలిశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, ప్రజలకు చేకూరిన లబ్ధిని వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, వియ్యపు కిశోర్, కోన వెంకట అప్పారావు, వియ్యపు మహేష్, ఎం. రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

మహిళల రక్షణ కోసమే 'దిశ'



దిశ చట్టంపై మహిళలకు అవగాహన కల్పిస్తున్న మంజుల

అక్కిరెడ్డిపాలెం: మహిళల రక్షణ కోసం ప్రవేశపెట్టిన దిశ చట్టంపై అవగాహన కలిగి ఉండాలని దిశ ప్రొటెక్షన్ వెల్ఫేర్ ఫౌండేషన్ జిల్లా అధ్యక్షురాలు మంత్రి మంజుల అన్నారు. దిశ గాజువాక నియోజకవర్గం మహిళా కార్యదర్శి ఎస్.కె.ఆశ ఆధ్వర్యంలో ఇందిర కాలనీలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో మంజుల మాట్లాడారు. దిశ చట్టం ద్వారా మహిళలు ఏ విధంగా రక్షణ పొందుతున్నారో వివరించారు. మహిళలకు ఏ ఆపద సంభవించినా రక్షణ కల్పించేలా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గం అధ్యక్షురాలు విమలా థామస్, సభ్యులు గొలుసు రామలక్ష్మి, చింతాడ మేరి పాల్గొన్నారు.

'పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి'

పెదగంట్యాడ: పెన్షనర్లకు కనీస పెన్షన్ రూ.9వేలు ఇవ్వాలని ఆల్ పర్సనల్ రిటైర్డ్ పెన్షనర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కణితి అప్పలరాజు కోరారు. పెదగంట్యాడ సీడబ్ల్యూసీలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పెన్షనర్లకు వైద్య సౌకర్యం కల్పించాలని, రైలు ప్రయాణాల్లో 50శాతం రాయితీ ఇవ్వాలని కోరారు. జిల్లా ప్రధాన కార్యదర్శి హుస్సేన్ మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి పోరాటాలు చేయాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. సమావేశంలో దీనబంధు, గురునాథ్, నమ్మి అప్పలనాయుడు, పెంటారావు తదితరులు పాల్గొన్నారు.

నేడు ముత్యాలమ్మ అనుపోత్సవం

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 69వ వార్డు తుంగ్లాంలో కొలువుదీరిన ముత్యాలమ్మ తల్లి అనుపు మహోత్సవాన్ని గురువారం నిర్వహించనున్నట్లు గ్రామాభివృద్ధి యువజన సేవా సంఘం ప్రతినిధులు తెలిపారు. అమ్మవారిని మంత్రి అమర్‌నాథ్, మేయర్ హరివెంకట కుమారి, ఎమ్మెల్యే నాగిరెడ్డి పాల్గొంటారని చెప్పారు. ఆ రోజు సాయంత్రం మేళతాళాలు, ప్రభలు, బల్ల వేషాలు, పులి వేషాలతో భారీ ఊరేగింపు నిర్వహించి, అనుపు చేస్తామని తెలియజేశారు.

స్వచ్ఛసర్వేక్షణ్‌లో భాగస్వాములు కావాలి



కార్యక్రమంలో ప్రసంగిస్తున్న జీవీఎంసీ అదనపు కమిషనర్ సన్యాసిరావు

గాజువాక: స్వచ్ఛసర్వేక్షణ్ కార్యక్రమంలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని జీవీఎంసీ అదనపు కమిషనర్ సన్యాసిరావు కోరారు. స్థానిక ఎంవీఆర్ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన స్వచ్ఛసర్వేక్షణ్ అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంపై ప్రతి ఒక్కరూ ఫీడ్ బ్యాక్ ఇవ్వాలని కోరారు. స్వచ్ఛసర్వేక్షణ్‌లో జీవీఎంసీని నంబర్ వన్ స్థానంలో నిలిపేందుకు అందరూ సహకరించాలన్నారు. 70వ వార్డు కార్పొరేటర్ ఉరుకూటి చందు, ఏఎంహెచ్‌వో డాక్టర్ కిరణ్ కుమార్, శానిటరీ సూపర్‌వైజర్ రామారావు పాల్గొన్నారు.

86వ వార్డులో..

కూర్మన్నపాలెం: స్వచ్ఛ సర్వేక్షణ్‌పై 86వ వార్డు ముస్తఫా జంక్షన్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏఎంహెచ్‌వో కిరణ్‌కుమార్ మాట్లాడుతూ స్వచ్ఛ సర్వేక్షణ్‌లో విశాఖను అగ్రగామిగా నిలపాలన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని నియంత్రించాలని, ఇంటి పరిసరాల్లో మొక్కలు నాటాలని కోరారు.

క్లుప్తంగా

120 మందికి వైద్య పరీక్షలు



రోగిని పరీక్షిస్తున్న వైద్యురాలు

అక్కిరెడ్డిపాలెం: గాజువాక స్వతంత్రనగర్ ఎస్టీ కాలనీలోని కల్వరి రివైవల్ మినిస్ట్రీస్ నేతృత్వంలో బుధవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. మినిస్ట్రీస్ సంఘ సేవకులు జాన్ మార్క్ ఆధ్వర్యంలో జరిగిన శిబిరంలో కంటి పరీక్షలు, క్యాన్సర్, ఈసీజీ, బీపీ, షుగర్ వంటి వ్యాధులకు పరీక్షలు చేసి, ఉచితంగా మందులు అందజేశారు. 120 మంది ఉచిత వైద్య సేవలు పొందారు. హెవెన్ చర్చ్ అండ్ ట్రస్ట్ సేవకులు డానియల్ సహకారంతో జరిగిన వైద్య శిబిరంలో గాజువాక క్రైస్తవ నాయకుడు, క్రిస్టియన్ పీస్ వెల్ఫేర్ సొసైటీ ప్రధాన కార్యదర్శి డేవిడ్ రాజు, సీనియర్ సేవకుడు రంగారావు, స్థానిక సేవకులు, కాలనీ పెద్దలు పాల్గొన్నారు.

పోలవరం నిర్వాసితుల కోసం నిధుల సేకరణ



భెల్ ప్రధాన గేటు వద్ద నిధులు సేకరిస్తున్న సీఐటీయూ నాయకులు

అక్కిరెడ్డిపాలెం: భెల్ (హెచ్‌పీవీపీ) ప్రధాన గేటు వద్ద సంస్థ సీఐటీయూ నాయకులు పోలవరం నిర్వాసితుల కోసం నిధుల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. బుధవారం విధులకు వెళ్లే ఉద్యోగుల నుంచి మూడు షిఫ్ట్‌లలో నిధులు సేకరించామని సిటూ ప్రధాన కార్యదర్శి జి.టి.పి.ప్రకాష్ తెలిపారు. సేకరించిన రూ.8,113ను నిర్వాసితులకు అందజేస్తామని చెప్పారు. కార్యక్రమంలో సిటూ నాయకులు కె.విజయ్ కుమార్, ఎస్.జగన్నాథరావు, కె.నారపురెడ్డి, ఎస్.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

కణితి హైస్కూల్‌ను సందర్శించిన ఆర్జేడీ



ఉపాధ్యాయులతో ఆర్జేడీ జ్యోతికుమారి

కూర్మన్నపాలెం: కణితి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను రీజినల్ జాయింట్ డైరెక్టర్ ఎం.జ్యోతి కుమారి బుధవారం సందర్శించారు. పాఠశాలలో జరుగుతున్న నాడు–నేడు పనులను పరిశీలించారు. పదో తరగతి పరీక్షల్లో ఫెయిల్ అయిన విద్యార్థులను కలిసి, ఎలా చదువుతున్నారో తెలుసుకున్నారు. అనంతరం జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను అభినందించారు. ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. ఎంఈవో బి.విశ్వనాథన్, ఎం.సునీత, పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం అరుణ, సిబ్బంది పాల్గొన్నారు.

ఉక్కు భద్రతా విభాగాధిపతికి అభినందనలు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ భద్రతా విభాగాధిపతి డి.రామ్‌ప్రసాద్‌ను స్టీల్ హెచ్ఎంఎస్ నాయకులు అభినందించారు. నూతన విభాగాధిపతిగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా యూనియన్ నాయకులు ఆయన్ను కలిసి సత్కరించారు. యూనియన్ అధ్యక్షుడు డి. అప్పారావు, ప్రధాన కార్యదర్శి జి.గణపతిరెడ్డి, పోలయ్య, ఈశ్వరరావు పాల్గొన్నారు.

సీపీఎం ధర్నా

గాజువాక : చెత్తపై పన్నును రద్దు చేయాలని, పెంచిన విద్యుత్ చార్జీలను రద్దు చేయాలని కోరుతూ సీపీఎం నాయకులు గాజువాకలోని వివిధ సచివాలయాల వద్ద బుధవారం ధర్నాలు నిర్వహించారు. గాంధీనగర్, శ్రీరామనగర్, దిబ్బపాలెం, సుందరయ్య కాలనీ, దళమికొండ, చట్టివానిపాలెం, అప్పన్న కాలనీ, అక్కిరెడ్డిపాలెం సచివాలయాల వద్ద నిర్వహించిన ధర్నాల్లో నాయకులు ఎం.రాంబాబు, ఎ.లోకేష్, డి.రమణ తదితరులు పాల్గొన్నారు.